# ఏడుగురు రాకుమారుల కథ

అనగనగనగనగనగా ఒక వూరు.

ఆ వూరికొక రాజు.

ఆ రాజుకి ఏడుగురు కొడుకులు.

ఏడుగురూ వేటకెళ్ళారు. వేటకి అంటే అడవిలోకి అనుకునేరు. కాదు కాదు. చెరువులోకి. అంటే చేపల వేటకన్నమాట!

ఏడుగురూ ఏడు చేపల్ని పట్టేరు. వాటిని ఊరేగింపుగా ఇంటికి తెచ్చి ఎండబెట్టేరు.



అందులో ఒక చేప ఎండలేదు. ఆ చేప ఎండనందుకు ఏడుగురు రాకుమారులకీ కోపం వచ్చింది.

మేమే రాకుమారులం మా చేతలకే ఎదురా అని మండిపడ్డారు. లేలేత మీసాల్ని పరపరా మెలేసేరు.

"చేపా చేపా! నువ్వెందుకు ఎండలేదూ" అని సూటిగా అడిగారు.

"నాకు గడ్డికుప్ప అడ్డొచ్చింది" అని జవాబిచ్చింది చేప.

మేమే రాకుమారులం మా చేతలకే ఎదురా అని మళ్ళీ మండిపడ్డారు ఏడుగురూ. నేరుగా గడ్డికుప్ప దగ్గరికె ళ్ళారు. అది మేలు జాతి పశువుల మేత కావడం వల్ల మిసమిసా మెరిసిపో తోంది.



"గడ్డికుప్పా గడ్డికుప్పా! నువ్వెందుకు అడ్డొచ్చేవూ" అని ఏడుగురూ అడిగారు.

"నన్ను రాజుగారి గుర్రం మేయలేదు" అని జవాబిచ్చింది గడ్డికుప్ప.

వాళ్ళకి రాజుగారి గుర్రం మీద కోపం వచ్చింది. నేరుగా గుర్రపుశాలకి వెళ్ళారు. రాజుగారి గుర్రం పనిమాలి తిని కూర్చోడం వల్ల తెగ బలిసిపోయింది.

"గుర్రమా గుర్రమా! నువ్వెందుకు గడ్డికుప్పని మేయలేదు" అని రాకుమారులు కేకలేసేరు.

"నన్ను కడజాతి కాపరి మేతకి వొదలలేదు" అని జవాబిచ్చింది గుర్రం.

మేమే రాకుమారులం, మా చేతలకే ఎదురా అని ఆ ఏడుగురుకీ మళ్ళీ కోపం వచ్చింది.

రాజుగారి గుర్రమంటే మేలుజాతి గుర్రం. ఆ గుర్రాలకు రాజులే రౌతులని, కడజాతి వారంతా కాపరులని ఆ రాజ్యంలో ఏనాడో కట్టుబాటు విధించేరు. అందువల్ల ఆ గుర్రపు కాపరి ఒక కడజాతి మనిషి.

రాజుగారి ఏడుగురు కొడుకులూ కడజాతి కాపరిని అప్పటికప్పుడే తమ వద్దకు పిలిపించుకున్నారు.

"కడజాతి కాపరీ, కడజాతి కాపరీ! గుర్రాన్ని మేతకెందుకు వొదల్లేదూ" అని ప్రశ్నించేరు.

ఆ ప్రశ్న వినగానే కడజాతి కాపరికి గుండె దడదడలాడింది. ఏ ప్రమాదం వచ్చిపడిందో తెలీకా గడ గడలాడిపోయాడు.

"క్షమించాలి మారాజులూ" అని మొదట వాళ్ళ కాళ్ళమీద పడ్డాడు.

రాజుగారి ఏడుగురు కొడుకుల్ని చూసి చేప బెదిరిపోలేదు. గడ్డికుప్పకీ బెదురు లేదు. గుర్రానికీ బెదురు లేదు. కానీ ఆ నిరుపేద కడజాతి కాపరి మాత్రం పిరికిగా వొణికిపోయాడు.

అతని వొణుకుని చూసీ ఏడుగురూ మరింత రెచ్చిపోయారు.

"కడజాతి కాపరీ! వొణికింది చాలు, నిజమేంటో చెప్పు" అని గద్దించారు.

"మా ముసల్ది నాకు చద్దన్నం పెట్టలేదు" అని భయంభయంగా జవాబిచ్చాడా కాపరి.

ఆ జవాబుతో రాజుగారి ఏడుగురు కొడుకులకీ వొళ్ళు మండిపోయింది.

మేమే రాకుమారులం, మా చేతలకే ఎదురా అని రంకెలేసేరు.

"తక్షణమే మా చెంతకి పిలవండా ముసలిదాన్ని" అని ఆజ్ఞలు జారీచేశారు.

ముసల్ది అంటే కడజాతి కాపరి తల్లి. కాపరికి నలభయ్యేళ్ళు. అతని తల్లికి అరవయ్యేళ్ళు. కబురందగానే ఆమె పరుగు పరుగున అక్కడికి వచ్చింది.



రాజుగారి ఏడుగురు బిడ్డల ముందు ఇద్దరూ తప్పుచేసిన వాళ్ళలాగా నిలబడ్డారు. అలా నిలబడ్డారు గానీ ఎక్కడ తప్పు జరిగిందో మాత్రం వాళ్ళకి అర్థం కావడం లేదు.

"ముసిల్దానా ముసిల్దానా! నీ కొడుక్కి చద్దన్నం ఎందుకు పెట్టలేదూ" అని ఏడుగురూ ఏకకంఠంతో ఆమెని గద్దించారు.

రాజుగారి బిడ్డలు అలా గద్దించేసరికి ముసల్ది జడిసిపోయి దండం పెట్టేసింది.

"నా చిన్నారి మన వరాలు వలవలా ఏడ్చింది" అని బితుకు బితుకుమంటూ జవాబిచ్చిందా ముసల్ది.

మేమే రాకుమారులం, మాకేటి ఎదురు అని చెప్పి రాజుగారి ఏడుగురు కొడుకులూ చిన్నారి మనవరాలిని ఆ క్షణమే అక్కడికి పిలిపించేరు.



"చిన్నారి మనవరాలా, చిన్నారి మనవరాలా! నువ్వెందుకు ఏడ్చావూ" అని అడిగారు.

"నన్ను చీమ కుట్టింది" అని కుడిచేతి చూపుడు వేలిని చూపించి బోరుమని ఏడ్చింది పాప.

కూతురు ఏడ్పుని చూసి కడజాతి కాపరి కన్నీళ్ళు పెట్టుకున్నాడు.

మనవరాలి ఏడ్పుని చూసి ముసలమ్మ కూడా కన్నీళ్ళు పెట్టుకుంది. కాని ఏడుగురు రాకుమారులూ మాత్రం పగలబడి నవ్వేరు.

"చీమ కుడితే కూడా ఇంత రాద్ధాంతం చేయాలా" అని వెటకారం చేసేరు. కడజాతి మనుషుల్ని తప్ప చీమలు మాత్రం ఎవర్నీ కుట్టగలవులే అని తీర్మానాలు చేసేరు. అక్కడితో ఆగిపోయినా బావుండు. కానీ వాళ్ళ డాబూ, దర్పం ఆగనీయలేదు.

మేమే రాకుమారులం, మాకేటి ఎదురు అని మళ్ళీ తొడలు చరిచేరు.

'ఎక్కడా తుంటరి చీమ, దాని అంతు చూస్తామని' దండయాత్రకి బయలుదేరారు.

అందరూ కలిసి చీమల పుట్టని చుట్టుముట్టేరు.

"చీమా చీమా! చిన్నారి పాపని ఎందుకు కుట్టావో చెప్పు" అని చిందులు తొక్కారు.

"నా బంగారు పుట్టలో వేలు పెడితే కుట్టనా మరి" అని చీమ చిన్నగా వినయంగా జవాబిచ్చింది.

చీమ ఇచ్చిన ఆ గడసరి జవాబు వినగానే రాజుగారి ఏడుగురు కొడుకులకీ చిర్రెత్తుకొచ్చింది.

మేమే రాకుమారులం, మాకేటి ఎదురు అని వూగిపోయేరు.

"చంటి పిల్ల మీద కాదు, దమ్ముంటే మా మీద చూపించు నీ ప్రతాపాలు" అని రాజుగారి ఏడుగురు కొడుకులూ ఒక్కసారే చీమల పుట్టలో వేళ్ళు పెట్టారు.

వాళ్ళ మాటలూ చేతలూ చూడగానే ఒక్క చీమకే కాదు, అన్ని చీమలకీ రోషం పొడుచుకొచ్చింది. పుట్టలోని చీమలన్నీ కసికసిగా వాళ్ళ మీద దాడిచేశాయి. చీమల కాట్లతో వేళ్ళు పొట్లైత్తిపోయాయి. ఆ బాధకి తాళలేక ఏడుగురు రాకుమారులూ వూరు మోతెక్కిపోయేలా గగ్గోలు పెట్టేరు. వాళ్ళ ఏడుపు విని రాజుగారు అక్కడికి పరుగున వచ్చారు. రాజవైద్యులూ పరుగున వచ్చారు.

చీమల దండు నుంచి వాళ్ళని రక్షించి కూడా కోటలోకి తోడ్కొని పోయారు.

ఏడుగురు రాకుమారుల ఏడుపు మొకాలు చూసి కడజాతి కాపరి విరగబడి నవ్వేడు.

**నీతి: చీమలకి రాజు పేదా తేడా వుండదు**

**– ఒమ్మి రమేష్‌బాబు**